క్లుప్తంగా

సిమెంటు రోడ్డు పనుల పరిశీలన



చౌడేపల్లె: బోయకొండ గంగాపురంలో ఉపాధి హామీ నిధులు రూ.1.5 కోట్లతో వేస్తున్న సిమెంటు రోడ్డును శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పీఆర్ డీఈఈ ప్రసాద్ అధికారులతో కలిసి పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు సకాలంలో పూర్తిచేయాలని, వాటర్ క్యూరింగ్ నెల పాటు చేయాలని ఆదేశించారు. అలాగే బోయకొండలో పలు అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. నేతలు చెంగారెడ్డి, మహమ్మద్‌షఫీ, వినోద్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

24న స్పాట్ అడ్మిషన్లు

కుప్పం: ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్సుల్లో పాసైన విద్యార్థులకు డాక్టర్ జెమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సుల్లో చేరికకు ఈ నెల 24న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ జగన్నాథ రావు తెలిపారు. సోమవారం తిరుపతితోని శ్రీ ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వీటిని నిర్వహిస్తారని, ఆసక్తి గల అభ్యర్థులు 23వ తేది ఆదివారం లోపు కుప్పం పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒకేషనల్ కోర్సుతో పాటు బ్రిడ్జి కోర్సు పాసైన వారు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు అర్హులని, పూర్తి వివరాల కోసం 9490309037 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే..



ఇటుకల బట్టీల వద్ద పిల్లలతో ఎంఈఓ

రొంపిచెర్ల: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని ఇటుకల బట్టీ వద్ద ఉన్న బడి ఈడు పిల్లలు, వారి తల్లిదండ్రులను కలసి అవగాహన కల్పించారు. రొంపిచెర్ల గ్రామ పంచాయతీలో చాలా మంది బడి ఈడు పిల్లలు బడి బయట ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. బడి ఈడు పిల్లలతో పని చేయిస్తే వారిపై కేసులు తప్పవని హెచ్చరించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన కొందరు కూలీలు ఇటుకల బట్టీలలో పని చేస్తూ జీవిస్తున్నారని, వారి పిల్లలను బడిలో చేర్పించేందుకు దృష్టి సారించినట్లు చెప్పారు.

సారా స్వాధీనం

కుప్పం: మండలంలోని బ్రహ్మ దేవరాచేన్లులో సారా స్వాధీనం చేసుకుని విక్రేతను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఈబి సీఐ కిషోర్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం..అటవీ ప్రాంతంలో సారా తయారు చేసి అమ్మకానికి సిద్ధంగా చేశారనే సమాచారం అందడంతో సెబ్ సీఐ తన సిబ్బందితో మధ్యాహ్నం దాడులు చేశారు. 55 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఈశన్ కుమార్తె మంజులపై కేసు నమోదు చేశారు.

బదిలీ టీచర్లకు వీడ్కోలు సన్మానం



శివరత్నమ్మను సన్మానిస్తున్న టీచర్లు

సోమల: స్థానిక ఉన్నత పాఠశాల నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన టీచర్లకు శుక్రవారం హెచ్‌ఎం తుంగా నాగరాజు ఆధ్వర్యంలో వీడ్కోలు సన్మానం చేశారు. హెచ్‌ఎం శివరత్నమ్మ ఎంఈఓ-2 ఉద్యోగోన్నతి పొందగా, ఉపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, శివరాజ, అమరనాథ్, కిషోర్ ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్లారు. ఈ నేపథ్యంలో వారిని సన్మానించి వారి సేవలను ప్రస్తుతించారు. పనిలో పనిగా ఎంఈఓ-2 శివరత్నమ్మ అదే స్కూలులో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో కరుణానిధి, జ్యోతీశ్వరుడు, భానుమూర్తి, షఫి, భానుమూర్తి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల ఆందోళన

పెద్దపంజాణి: తమ సమస్యల సాధన కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలంలోని వీఆర్‌ఏలు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని, పే స్కేల్ వర్తింపజేయాలని, 60 ఏళ్లు దాటిన వీఆర్‌ఏలకు వన్‌టైం సెటిల్‌మెంటు కింద ఆ కుటుంబంలో ఉద్యోగం ఇవ్వాలని, అటెండర్, వాచ్‌మెన్‌లుగా వీఆర్‌ఏలను నియమించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దార్ లోకేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో వెంకట్రమణ, మునెప్ప, గాయత్రి, శివకుమార్, బుడ్డారెడ్డి, గిరిజమ్మ, సయ్యద్‌బాషా, షుకూర్‌సాబ్, క్రిష్ణప్ప, రాజన్న, చెంగప్ప, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

వి.కోటలో..

వి.కోట: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్‌ఏలు ఆందోళన చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వినతిపత్రం ఇచ్చారు.

డీకేటీ రైతుల జీవితాల్లో వెలుగులు

డీకేటీ భూములను సెటిల్‌మెంటు చేస్తామని 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ తర్వాత అధికారంలోకి రాగానే ఆ హామీని అటకెక్కించారు. దరఖాస్తు భూములను సెటిల్‌మెంటూ చేయక పోగా, డీకేటీ భూముల పట్టామార్పులు, కొత్త పట్టాల జారీపై నిషేధం విధించారు. అంతేకాకుండా భూ పంపిణీ కార్యక్రమాన్ని కొండెక్కించారు.ఫలితంగా డీకేటీ భూముల రైతులు వాటిని విక్రయించుకోలేక, బ్యాంకులో తనఖా పెట్టేందుకు వీలుగాక చాల ఇబ్బందులు పడే వారు. ఈ సమస్యను రైతులు ప్రజా సంకల్ప పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. నాడు రైతులకిచ్చిన హామీకి ప్రస్తుతం సీఎంగా ఆయన కార్యరూపం ఇచ్చారు. డీకేటీలను సెటిల్‌మెంట్ చేయడం, భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫలితంగా డీకేటీ భూములు ఎక్కువగా ఉన్న పలమనేరు నియోజకవర్గ రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.



బయ్యప్పగారిపల్లె వద్ద ఒక డీకేటీ భూమి

- 20 ఏళ్లు డీకేటీ పట్టాలున్నవారి భూములు ఇక సెటిల్‌మెంట్
- 20వేల మంది రైతులకు ప్రయోజనం
- భూములను అవసరానికి విక్రయించుకునే హక్కు
- ఇకపై డీకేటీ భూములకూ బ్యాంకు రుణాలు
- భూమిలేని నిరుపేదలకు భూ పంపిణీ
- ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని భూముల్లో సగం భూములు డీకేటీ(దరఖాస్తు పట్టాలు)గానే ఉన్నాయి. ప్రభుత్వ రికార్డుల మేరకు నియోజకవర్గంలో 65వేల ఎకరాల డీకేటీ భూములున్నాయి. ఇందులో 40వేలమంది రైతులు పంటలను సాగు చేస్తున్నారు. ఈ భూములకు పట్టాలు కేటాయించినపుడే ప్రభుత్వం పలు షరతులతో పట్టా(డి-ఫామ్)లిచ్చింది. ఈ భూములను పట్టాదారు వంశపారంపర్యంగా అనుభవించుకోవాల్సిందేగానీ వాటిని క్రయ, విక్రయాలు చేయరాదు. ఈ భూముల్లో లభించే ఖనిజాలు, నిధులు, ఇతరత్రా వాటిపై కూడా ప్రభుత్వానికే హక్కు ఉంటుంది. అలా కాదని ఎవరైనా ఈ భూములను విక్రయిస్తే ఎలాంటి నోటీసు లేకుండానే భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు. దీంతో డీకేటీ భూములున్న రైతులు కేవలం పంటలను సాగు చేసుకోవడం మినహా భూమిపై ఎలాంటి హక్కులేకుండా పోయింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ నిర్ణయం వీరి జీవితాల్లో వెలుగులు నింపనుంది. 40వేల మంది డీకేటీ పట్టాలున్న రైతుల్లో 20 ఏళ్ల పట్టా మారకుండా ఉంటూ ప్రస్తుతం సెటిల్‌మెంట్‌గా మార్పు పొందనున్న రైతులు 20 వేలమంది వరకూ ఉండొచ్చని రెవెన్యూ అధికారుల అంచనా. వీరు దరఖాస్తు భూములపై హక్కు పొందడమే కాకుండా ఆ భూములను విక్రయించుకునే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా బ్యాంకు రుణాలను పొందే వెసులుబాటు కలగనుంది.

డీకేటీ పట్టాలను బదిలీ చేసుకునే అవకాశం

మరణించిన తండ్రి పట్టాను వారి వారసులకు, కుటుంబ సభ్యుల నుంచి బంధువులు లేదా కుటుంబీకులే భూమి పట్టాలను మార్చుకునే వెసులుబాటు ప్రభుత్వ నిర్ణయంతో కలగనుంది. మరోవైపు భూ పంపిణీకి సైతం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎనిమిదేళ్లుగా భూ పంపిణీ చేయక, ఇప్పటికీ పరిష్కారం కాని ఫౌతీ పట్టాలు(వారసత్వ రీత్యా మార్చుకునే డీకేటీ పట్టాలు) సైతం 980 వరకు తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. డీకేటీ పట్టాలు మార్చుకాక చనిపోయిన వారి పేరుతోనే ఇప్పటికీ నియోజకవర్గంలో 2వేల దాకా ఖాతాలున్నట్టు సమాచారం. దీంతో ఈ భూముల్లో వేరుశనగ తదితర పంటలను పండించి, ఇన్‌పుట్ సబ్సిడీ పొందాలన్నా వారసులకు వీలుకాని పరిస్థితులుండేవి. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలాంటి సమస్యలన్నీ పరిష్కారం కానున్నాయి. దీంతో పాటు భూమిలేని నిరుపేదలకు 500 ఎకరాలకు పైగా పంపిణీ చేసేందుకు ఆయా మండలాల రెవెన్యూ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం డీకేటీ రైతులకు వరంలా మారింది.

మా గుండెల్లో జగనన్న



అమ్మడానికి వీల్లేని డీకేటీ భూములను పంట పెట్టుబడి కోసమో, అవసరాల కోసం బ్యాంకులో తాకట్టు పెడదామంటే లోను రాదు. వడ్డీ వ్యాపారులు కూడా డీకేటీ అంటే అప్పులివ్వరు. డీకేటీ పట్టాలను సెటిల్‌మెంటు చేస్తామని గత ఎన్నికలపుడు చంద్రబాబు హామీ ఇచ్చి మాట తప్పారు. అయితే జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కష్టాలను గమనించి ఇచ్చిన మాటను సీఎం అయ్యాక నెరవేర్చారు. నాలాంటి రైతులు జగనన్న ఫొటోను ఇంట్లో పెట్టుకుని ఆయన్ను మా గుండెల్లో దాచుకుంటాం. **-బాలాజి నాయుడు, డీకేటీ రైతు, బయ్యప్పగారిపల్లె**

దశాబ్దాల కల నెరవేరింది



మా పెద్దల కాలం నుంచి డీకేటీ భూముల సమస్య ఉంది. భూములుండీ హక్కులేని వారిలా బతకాల్సి వచ్చేది. డీకేటీ భూముల విషయంలో చంద్రబాబు ఆయన హయాంలో ఇచ్చిన మాటను గాలికొదిలేశారు. కానీ ఇచ్చిన మాటను జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు. ఇది మాకెంతో సంతోషం. జగనన్న చేసిన మేలును మా బిడ్డలకు కూడా చెబుతాం. ఇన్నాళ్లకు డీకేటీ రైతుల కల నెరవేరింది. **-గేట్ బాబు, డీకేటీ రైతు, పలమనేరు**

పింఛను పునరుద్ధరించారయ్యా!

- అంతా వలంటీర్ పుణ్యమే
- జగన్‌కు రుణపడి ఉంటానంటున్న వృద్ధురాలు



సరస్వతమ్మకు పునరుద్ధరించిన పింఛను ఇస్తున్న వలంటీర్ గీత

ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు సరస్వతమ్మ. వయస్సు 65 ఏళ్లు. పలమనేరు మున్సిపాలిటీ రంగాపురంలో ఆమె నివసిస్తోంది. ఆమెకు వస్తున్న వితంతు పింఛను ఉన్నపళాన ఆగిపోవడంతో ఆందోళన చెందింది. ఒంటరి మహిళ అయిన ఆమె పింఛనుపైనే ఆధారపడింది. ఇది తెలుసుకున్న వలంటీర్ గీత ఆమె ఉన్న ఇంటికి వెళ్లింది. 'మా ఇల్లు పెద్దగా ఉందని పింఛను ఆపేశారంట!' అని వృద్ధురాలు తన గోడు నివేదించింది. వలంటీర్ ఆ తర్వాత సంబంధిత సచివాలయ అధికారులతో మాట్లాడింది. సాంకేతిక కారణాలతో పింఛను నిలుపుదల చేశారని తెలుసుకుంది. పింఛను పునరుద్ధరణకు అవసరమైన ధ్రువపత్రాలను సచివాలయ సిబ్బందితో అప్‌లోడ్ చేయించింది. పింఛను మంజూరు చేయించింది. ఇప్పుడా వృద్ధురాలి మోము వెలిగిపోయింది. మా వలంటీర్ నాకు చాలా మేలు చేసింది..బతికుందేదాకా జగన్‌ను మరువనని అందరికీ చెబుతోంది.

-పలమనేరు

ఎంపీ ఆర్థిక సాయం

సోమల: కందూరు పంచాయతీ సమాధిగుట్టపల్లెకు చెందిన పద్మావతమ్మకు ఇంటి నిర్మాణానికిగాను రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సొమ్మును శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పద్మావతమ్మకు అందజేశారు. ఎంపీడీఓ నాగరాజ, పార్టీ మండల కన్వీనర్ గంగాధరం, ఉపాధ్యక్షుడు నాగభూషణం రెడ్డి, ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రభాకర, సర్పంచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నెల వ్యవధిలో సమస్యలు పరిష్కరించండి



లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే

గంగవరం: ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను నెల వ్యవధిలో పరిష్కరించాలని, మరోసారి గ్రామానికి వచ్చినప్పుడు సమస్యలనేవే ఉండరాదని ఎమ్మెల్యే వెంకటేగౌడ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన గండ్రాజుపల్లె-2 సచివాలయ పరిధిలో బండిండ్లులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఆయన కుటుంబాల్లోని వ్యక్తులు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. ఉగిణి గ్రామ సమీపంలో రూ. 21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని తొలుత ఆయన ప్రారంభించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

రెండు వీధుల్లో సీసీ రోడ్లు వేయాలని, మురుగు కాలువలు నిర్మించాలని, విద్యుత్ స్తంభాలు, తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. సమస్యలపై ఎమ్మెల్యే స్పందించారు. ఎమ్మెల్యే అక్కడికక్కడే జీజీఎంపీ ద్వారా నిధులు మంజూరు చేశారు. మురుగు కాలువల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కరెంట్ సమస్యలను పరిష్కరించాలని, ప్రతి వీధిలో తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. మళ్లీ వచ్చే గడప గడప కార్యక్రమంలో ఎక్కడైనా పనులు పెండింగ్‌లో ఉన్నట్లు తన దృష్టికి వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతుల శ్రేయస్సు కోసమే ఆర్బీకేలు

రాష్ట్రంలోని రైతులందరూ సుఖ సంతోషాలతో ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. సంక్షేమ పథకాలతో పాటు సబ్సిడీ బీమా వంటివి రైతులకు అందేలా చూడాలన్నారు. తమ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఎంపీపీ వెంకటరమణ, వైస్ ఎంపీపీ ఆదాంబాషా, సర్పంచ్ మల్లికార్జున, ఎంపీటీసీ భాస్కర్, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోండి





రొంపిచెర్ల: మాట్లాడుతున్న తహసీల్దార్ అమరనాథ్, పలమనేరు : కల్లాడులో..

రొంపిచెర్ల: అర్హులైన యువతీ యువకులు ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ అమరనాథ్ కోరారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో రాజకీయ పార్టీలతో ఓటర్ల జాబితాలో మార్పులు-చేర్పులు, సవరణలపై సమావేశం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటర్లుగా నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి ఓటర్లను బదిలీ కూడా చేస్తామని అన్నారు. గ్రామ పంచాయతీలలోని బీఎల్‌ఓల వద్ద దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే ఓటర్లు తమకు ఓటు ఉందా, లేదా? అన్నది జాబితాలో సరిచూసుకోవాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, డీటీలు వెంకటరమణా రెడ్డి, లోకేష్ , బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

సదుంలో...

సదుం: తహసీల్దారు చంద్రశేఖర్ శుక్రవారం తన కార్యాలయంలో అఖిలపక్షం నాయకులతో ఓటర్ల జాబితా విషయమై సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో తప్పుల సవరణకు ఆగస్టు 21 వరకు ఇంటింటా సర్వే చేయనున్నట్టు చెప్పారు. సర్వేలో అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో రెడ్డెప్పరెడ్డి(వైఎస్సార్‌సీపీ), రెడ్డిప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, అమర్‌నాథ్(టీడీపీ) పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కుమారస్వామి కోరారు. ఓటర్ల జాబితా విషయమై శుక్రవారం తన కార్యాలయంలో ఆయన అఖిల పక్షం నాయకులు, వీఆర్‌ఓలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, బీఎల్‌ఓలు, అధికారులు గ్రామాల్లో పర్యటించి ఓటర్ల జాబితాలో మార్పులు-చేర్పులు, తొలగింపులు, సవరణలు చేస్తారని, దీనిని ఓటర్ల ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

పలమనేరు మండలంలో..

పలమనేరు: పలమనేరు మండలంలో శుక్రవారం నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సర్వేలో కరిడిమొడుగు గ్రామ సర్పంచ్ హంసవేణి పాల్గొన్నారు. ఇంట్లో లేనివారు, కొత్త కోడళ్లుగా వచ్చినవారు, మృతి చెందినవారు, 18 ఏళ్లు నిండినవారి వివరాలను తెలుసుకుని ఓటర్ల జాబితాలో మార్పులు-చేర్పులు, సవరణలు చేయించారు. అలాగే కొలమాసనపల్లె పంచాయతీలోనూ ఇదే కార్యక్రమం నిర్వహించారు. మనోజ్‌రెడ్డి, నరసింహారెడ్డిపాల్గొన్నారు.

శాంతిపురం మండలంలో..

శాంతిపురం: ఓటర్ల జాబితాలో లోపాలను సవరించి, పకడ్బందీగా తయారు చేయడానికి సహకరించాలని తహసీల్దార్ నరసింహులు కోరారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన వివిధ పార్టీల నాయకులతో సమావేశమై ఓటర్ల జాబితాలో నమోదు, మార్పులు-చేర్పులు, సవరణల గురించి మాట్లాడారు. రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, టీడీపీ నేత విశ్వనాథ నాయుడు, కాంగ్రెస్, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

సీఎం ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి

- జిల్లా స్పెషలాఫీసర్ వీరపాండియన్



ఆర్బీకేను తనిఖీ చేస్తున్న వీరపాండియన్

కుప్పం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ఉన్నతాశయంతో ఆర్బీకేలను తీసుకువచ్చారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా పని చేసి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా స్పెషలాఫీసర్, ఐఏఎస్ అధికారి వీరపాండియన్ ఆర్బీకే సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన చెక్కునత్తం ఆర్బీకేను తనిఖీ చేశారు. ఆర్బీకేలో ఇక్కడ రైతులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, రైతులు వ్యవసాయ పనిముట్లు, ఎరువుల కోసం బయటికి వెళ్లే పరిస్థితి ఉండరాదన్నారు. ఆర్బీకేకి వచ్చే రైతులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా మసలుకోవాలన్నారు. అలాగే వ్యవసాయ సీజన్‌కు ముందుగానే విత్తనాలు, ఎరువుల పంపిణీకి ప్రణాళికలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఏఓ మురళీకృష్ణ, ఏడీఏ అన్నపూర్ణాదేవి, వ్యవసాయాధికారి అమృతవల్లి, విస్తరణాధికారి ఔరంగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవమూర్తి ఊరేగింపు

చౌడేపల్లె: కాటమరాజు ఉత్సవమూర్తిని మదుకూరు, మల్లెలవారిపల్లెలో శుక్రవారం ఊరేగించారు. పరికిదొన పంచాయతీలోని అన్ని గ్రామాల్లో ఊరేగిస్తామని గ్రామస్తులు చెప్పారు. వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని ఉత్సవమూర్తికి పూజలు చేశారు. మొక్కులు చెల్లించారు.

జోరుగా 'జగనన్న సురక్ష' సభలు



పుంగనూరు: పాళ్యెంపల్లెలో..



చౌడేపల్లె: దిగువపల్లెలో..



పెద్దపంజాణిలో..



వి.కోట: ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

పుంగనూరు: జగనన్న సురక్ష కార్యక్రమంతో పలు సమస్యలకు పరిష్కారం లభిస్తోందని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాళ్యెంపల్లెలో ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డితో కలసి 'జగనన్న సురక్ష' నిర్వహించి లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. 1వ తేదీ ప్రారంభించిన ఈ కార్యక్రమం ఈనెలాఖరు వరకు కొనసాగుతుందని, ఇప్పటి వరకు మండలంలో 2,923 అర్జీలు స్వీకరించి 2,714 అర్జీలు పరిష్కరించినట్లు చెప్పారు. మిగిలిన సమస్యలను ఆయా శాఖలకు బదలాయించామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మాజీ ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి, సచివాలయాల కన్వీనర్ చెంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో 372 మందికి ధ్రువపత్రాలు

పట్టణంలోని చంద్రకాంత్‌వీధి, గోకుల్‌వీధి, జోగింద్లు ప్రాంతాలలో కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, చైర్మన్ అలీమ్‌బాషా ఆధ్వర్యంలో జగనన్న సురక్ష నిర్వహించారు. 372 మందికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, కన్వీనర్ వరదారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజేష్, అమ్ముకుట్టి, అస్లాం మురాది తదితరులు పాల్గొన్నారు.

దిగువపల్లెలో 102 మందికి..

చౌడేపల్లె: మండలంలోని దిగువపల్లె సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 102మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువ పత్రాలను ఎంపీపీ రామ్మూర్తి, వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, పాల ఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ ,లడ్డూ రమణ తదితరులు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, సర్పంచ్ సోని, ఎంపీటీసీ గంగులమ్మ, స్పెషలాఫీసర్ ప్రసాద్, ఎంపీడీఓ సుధాకర్, తహసీల్దార్ మాధవరాజు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో 491 మందికి..

పెద్దపంజాణి: పెద్దపంజాణి సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్షలో 239 మంది లబ్ధిదారులకు కులం, 247 మందికి ఆదాయ ధ్రువప్రతాలు, ఐదుగురికి కౌలు రైతు కార్డులను జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మకీర్తి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, సర్పంచ్ అఖిల తదితరులుపంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఓబుల్ రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరినాథ్, ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దార్ లోకేశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు సతీష్ రెడ్డి, అబ్బాస్, మహదేవ రెడ్డి, పీఎస్ సుబ్రమణ్యం, మాజీ సర్పంచ్ రమణా రెడ్డి, పార్టీ నాయకులు జాఫర్, శ్రీరాములు రెడ్డి, రెడ్డిబాషా, మండల సోషల్ మీడియా కన్వీనర్ బాలాజి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వి.కోట మండలంలో 342 మందికి..

వి.కోట: వి.కోట మేజర్ పంచాయతీ సచివాలయం -1, ఓగు సచివాలయం, ఎస్ బండ్లపల్లె సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు. ఎంపీపీ యువరాజు, సర్పంచ్ పీఎస్.లక్ష్మి మొత్తం 342మంది లబ్ధిదారులకు వివిధ ధ్రువపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిట్టిబాబు, ఎంపీడీఓ వినోద, ఈఓ యాదవపతి, ఈఓఆర్‌డీ నరేష్, ఓగు, ఎస్ బండపల్లె సర్పంచులు లలిత కుమారి, విష్ణు, పంచాయతీ కన్వీనర్లు సుబ్రమణ్యం, రాము, సచివాలయ కన్వీనర్లు అమరనాథ్, వెంకటేష్, నాయకులు కుమార్‌రాజా, శశికళ, రఘుపతి, అరసప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామ సచివాలయాలలో..

శాంతిపురం: మండలంలోని మొరసనపల్లె, కడపల్లె గ్రామ సచివాలయాల్లో శనివారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ హేమమాలిని తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


చెరువుల అభివృద్ధికి రూ.7 కోట్లు మంజూరు



వివరాలు వెల్లడిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తదితరులు

చౌడేపల్లె: మండలంలోని 47 చెరువులను ఇరిగేషన్ శాఖ ద్వారా అభివృద్ధి చేయడానికి రూ.7కోట్లు మంజూరయ్యాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఈ నిధులతోపాటు అదనంగా ఉపాధి నిధులు రూ.60 లక్షలు మంజూరయ్యాయని, గ్రామాల్లో ఇంకనూ అవసరమైన పనుల వివరాలు తెలియజేయాలని కోరారు. మంజూరైన పనులను త్వరితగతిన ప్రారంభించి, సకాలంలో పూర్తిచేయాలని, మరిన్ని అవసరమైన పనులకు ప్రతిపాదనలు పంపాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ రామ్మూర్తి, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, ఎంపీడీఓ సుధాకర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బోయకొండలో రాహుకాల అభిషేక పూజలు



చౌడేపల్లె : ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలను నిర్వహించారు. అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధిచేసి మామిడి, వేపాకు తోరణాలతో అలంకరించారు. ఉదయం 10:30 నుంచి 12 గంటల వరకు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ రాహుకాల అభిషేక పూజలు చేశారు. రంగు రంగుల పూలు, స్వర్ణాభరణాలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి 53 జంటలు పూజల్లో పాల్గొన్నాయి. ఈఓ చంద్రమౌళి పర్యవేక్షించారు.

గాజుల అలంకరణలో వాసవీమాత

వి.కోట: పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం విశేష అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అధికమాసం తొలి శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. గాజుల కట్టలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ లక్ష్యాలపై అవగాహన



మాట్లాడుతున్న సర్పంచ్ ఇబ్రహీంఖాన్

రొంపిచెర్ల: స్వచ్ఛ సర్వేక్షణ్ లక్ష్యాలపై సచివాలయ వలంటీర్లు అవగాహన కలిగి ఉండాలని సర్పంచ్ ఇబ్రహీంఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వలంటీర్లకు అవగాహన కల్పించారు. ఆగస్టు 1నుంచి 15వ తేదీ వరకు స్వచ్ఛ సర్వేక్షణ్ కమిటీ సభ్యులు మండలంలో పర్యటించే అవకాశం ఉందని, వారు మరుగుదొడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు మొదలైన వాటిని తనిఖీ చేస్తారని, అనంతరం ఉత్తమ గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి అవార్డులను ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయాల కన్వీనర్ కరీముల్లా, కార్యదర్శులు నాగరాజ, రవిచంద్రబాబు, వీఆర్వోలు శ్రీనివాసులు, వెంకటరమణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి పనుల తనిఖీ



పలమనేరు మార్కెట్, మోడల్ మార్కెట్లను పరిశీలిస్తున్న మార్కెటింగ్ జేడీఎం తదితరులు

పలమనేరు: పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో చేస్తున్న అభివృద్ధి పనులను మార్కెటింగ్ జేడీఎం రాజశేఖర్ నాయుడు, ఆర్‌జేడీ రామాంజనేయులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక టమాట మార్కెట్‌లో ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకున్నారు. పట్టణ సమీపంలోని 33 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ మోడల్ టమాట మార్కెట్ పనులను పరిశీలించారు. ఈ ప్రాంతం రెండు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉండడంతో వ్యాపారం చాలా బాగుంటుందని ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆపై వి.కోట మండలంలోని శివునికుప్పం మార్కెట్ యార్డు పనులను పరిశీలించి, స్థానిక ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో డీడీఎం సుధాకర్, డీఏటీఎంఓ పరమేశ్వరన్, పలమనేరు టమాట మండీల సంఘ అధ్యక్షులు మండీ సుధా, ఏఎంసీ సెక్రటరీ సంజీవకుమార్ పాల్గొన్నారు.